సాక్షి ఆదిలాబాద్

మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024



సేంద్రియ ఎరువులకు డిమాండ్

సేంద్రియ ఎరువులకు డిమాండ్ పెరుగుతోంది. భూసారంతో పాటు పంట దిగుబడి పెరుగుతుండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. 9లో▸

రంజాన్ వేళలు

మంగళ ఇఫ్తార్ 6:33

బుధ సహర్ 4:40

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.0/24.0

ఆకాశం పలుచోట్ల మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత ప్రభావం కనిపించనుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి.

క్రోధి.. ఆశలు



తెలుగు నూతన సంవత్సరాది.. ఉగాది. షడ్రుచుల పండుగ. ఈ రోజున ఏదైనా శుభకార్యాలు ప్రారంభిస్తే ఏడాదంతా శుభాల ఉషస్సులు వెల్లివిరిస్తాయని ప్రజల నమ్మకం. నేడు క్రోధి నామ సంవత్సరానికి ఘన స్వాగతం పలికేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. ఆలయాల్లో ఉదయం పూజలు, సాయంత్రం పంచాంగ శ్రవణ కార్యక్రమాల కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. క్రోధి.. కోపాన్ని, ద్వేషాన్ని జయించి, ఉప్పొంగే ఉత్సాహాలు, సంతోషాలను అందించాలని.. విజయాలను విరబూయించాలని ఆశిద్దాం.

- వివరాలు 8లో▸




ఆ ఇద్దరు.. కదలట్లే!

- డిప్యూటేషన్ రద్దు చేసినా పాత చోటే విధులు
- రిలీవ్ చేయని 'స్పోర్ట్స్' అధికారులు
- ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్లపై చర్యలు కరువు



జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ స్కూల్



Sub:-School Education, Adilabad District-Temporary Deputation of teachers to work at Telangana Sports School, Adilabad temporarily for the academic year 2023-24 - Cancellation of deputation orders-Reg.

1. Sri.R.Kabeerdas,SGT,MPPS Tantholi,Adilabad.
2. Smt.R.Jayasree,PET,ZPSS Utnoor U/M

Asst. Director.

డిప్యూటేషన్ రద్దు చేస్తూ డీఈవో జారీ చేసిన ఉత్తర్వు ప్రతి (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: అందరికీ ఆదర్శంగా నిలవాల్సిన గురువులు కొంత మంది తప్పటడుగులు వేస్తున్నారు.. నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు.. ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు.. అక్రమంగా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో వారి డిప్యూటేషన్ రద్దు చేశారు. వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రం పెడచెవిన పెట్టారు. జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ స్కూల్‌లో ఇద్దరు ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌ను రద్దు చేసినా వారు పనిచేసే పాఠశాలకు వెళ్లకుండా అక్కడే తిష్ట వేశారు. ఆ ఉపాధ్యాయులకు అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలు ఉండడంతో ఇలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కదలరు.. వదలరు

ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలని గతేడాది ఆగస్టులో ఉపాధ్యాయ జేఏసీ నాయకులు కలెక్టర్, డీఈవోలకు విన్నవించారు. 2023 ఆగస్టు 3న జేఏసీ నాయకులతో డీఈవో సమావేశమై డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఉపాధ్యాయులను సొంత పాఠశాలలకు పంపించేందుకు నిర్ణయించారు. 2023 ఆగస్టు 24న నలుగురు ఉపాధ్యాయుల డిప్యూటేషన్ రద్దు చేశారు. మరో ఎస్జీటీ, ఓ పీఈటీ అక్కడే పనిచేయడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు డీఈవోపై ఒత్తిడి తేవడంతో గతేడాది సెప్టెంబర్ 4న ఇద్దరు డిప్యూటేషన్‌ను రద్దు చేశారు. వెంటనే విధుల్లో చేరాలని, లేకుంటే వేతనం నిలిపివేయాలని సంబంధిత మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలిలో పనిచేసే ఓ ఎస్జీటీ, ఉట్నూర్ జెడ్పీఎస్ఎస్‌లో పనిచేసే పీఈటీ ఇప్పటికీ జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ స్కూల్‌లోనే కదలరు.. వదలరన్న రీతిలో ఉన్నారు.

ఆదేశాలు బేఖాతరు..

గత సెప్టెంబర్‌లో జిల్లా విద్యాశాఖాధికారి ఇద్దరు ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను రద్దు చేశారు. వెంటనే విధుల్లో చేరాలని, లేకుంటే వేతనం నిలిపివేస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే తొమ్మిది నెలలుగా వారు పనిచేస్తున్న పాఠశాలకు వెళ్లకుండా స్పోర్ట్స్ స్కూల్‌లోనే కొనసాగుతున్నారు. ఈ ఇద్దరిని అక్కడి అధికారులు రిలీవ్ చేయాల్సి ఉన్నప్పటికీ వారు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. విధుల్లో చేరకపోతే నిబంధనల ప్రకారం వేతనం నిలిపివేయాల్సిన అధికారులు 'మామూలు'గా వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఇద్దరు గురువుల్లో ఒకరికి ఏకంగా స్టేడియంలోనే ఉండడానికి అధికారి ఓ గదిని కేటాయించడం గమనార్హం. కాగా డీఈవో కార్యాలయంలోని సంబంధిత సెక్షన్ ఉద్యోగి వద్ద వారి డిప్యూటేషన్ రద్దు చేసిన కాపీ మాత్రమే అతడి వద్ద ఉంది. డిప్యూటేషన్ రద్దు చేసిన తర్వాత మళ్లీ డిప్యూటేషన్ కొనసాగించడానికి ఉత్తర్వులు జారీ చేశామని అధికారులు చెబుతున్నప్పటికీ సంబంధిత ఉద్యోగుల వద్ద ఉత్తర్వులు మాత్రం లేవు. డీఈవో కార్యాలయ ఉద్యోగులు మాత్రం డిప్యూటేషన్ కొనసాగించే ఉత్తర్వులు జారీ చేయలేదని స్పష్టం చేస్తున్నారు. ఈ విషయమై డీఈవో ప్రణీతను వివరణ కోరేందుకు ఫోన్‌లో యత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

న్యూస్‌రీల్

చల్లబడ్డ వాతావరణం

కైలాస్‌నగర్: జిల్లాలో వాతావరణం కాస్త చల్లబడింది. మార్చి ఆరంభం నుంచి మొన్నటి వరకు భానుడు తన ప్రతాపం చూపాడు. పగటి ఉష్ణోగ్రతలు ఏకంగా 43 డిగ్రీల మార్కు దాటాయి. ఎండల తీవ్రతతో జనం విలవిల్లాడారు. అయితే రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావారణం ఒక్కసారిగా చల్లబడింది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో, సోమవారం వేకువజామున, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలుల కారణంగా పలుమండలాల్లో మొక్కజొన్న నేలవాలింది. వాతావరణం చల్లబడడంతో ఉక్కపోత నుంచి జనం కొంత ఉపశమనం పొందారు.

'ఆయుష్' నిర్వహణకు అనుమతి తప్పనిసరి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న ఆయుష్ (ఆయుర్వేద, హోమియో, సిద్ధ, నేచురోపతి, యోగ, యునాని) క్లినిక్‌లు, పాలిక్లినిక్‌లు, ఆసుపత్రులను నడిపేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్-2010 ప్రకారం తప్పనిసరిగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం నుంచి అనుమతి తీసుకోవాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ప్రకటనలో తెలిపారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జతపరుస్తూ,అప్లికేషన్ ఫాంను వెంటనే సమర్పించాలని పేర్కొన్నారు. అలాగే జిల్లాలోని అలోపతి, ఆయుష్ హాస్పిటల్స్, డయాగ్నొస్టిక్ సెంటర్స్‌ను రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాతే నడపాలని సూచించారు. రిజిస్ట్రేషన్ లేకుండా నడిపితే చట్టపరంగా వాటిని సీజ్‌చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

గుడిహత్నూర్: వేసవి దృష్ట్యా ప్రజలకు అందించాల్సిన వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సోమవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీలో ప్రసవాల వివరాలను వైద్యాధికారి శ్యాంసుందర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశా కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గర్భిణుల విషయంలో అప్రమత్తంగా ఉంటూ హైరిస్క్ కేసులను రిమ్స్ తరలించి చికిత్స అందేలా చూడాలన్నారు. ఇందులో ఫార్మసిస్ట్ శివాజి, వైద్య సిబ్బంది ఉన్నారు.

నేడు ఉగాది పచ్చడి పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: ఉగాది సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో మంగళవారం ఉగాది పచ్చడి పంపిణీ ఉంటుందని మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి తెలిపారు. సోమవారం ఆయన మఠంలో విలేకరులతో మాట్లాడారు. సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే సాయంత్రం 6 గంటలకు చికిలి వెంకటేశ్వర శాస్త్రి ఆధ్వర్యంలో పంచాంగ శ్రావణం ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి మాధవ్, గౌరవాధ్యక్షుడు ప్రఫుల్ వరేఘ, సభ్యులు రవీందర్, పరమేశ్వర్, సూర్యకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్లీ బర్డ్.. ఆఫర్



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రచార ఫ్లెక్సీ

- ఆస్తి పన్ను వసూళ్లకు ప్రత్యేక స్కీం
- ముందస్తుగా చెల్లిస్తే 5శాతం రాయితీ
- ఈ నెలాఖరు వరకు గడువు
- బల్దియా పరిధిలో 18 బృందాలు

ఆదిలాబాద్‌లోని అసెస్‌మెంట్లు	46,528
వాటి ఆస్తి పన్ను డిమాండ్	రూ.11.50 కోట్లు
వాటికి ఐదు శాతం రాయితీ	57.05లక్షలు
ఇప్పటి వరకు వసూలైంది	రూ.8.33 లక్షలు

కైలాస్‌నగర్: మున్సిపాలిటీలో ఆస్తి పన్ను వసూళ్లపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ముందస్తుగా పన్ను చెల్లించేలా ఎర్లీబర్డ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ నెల 30 వరకు ఈ స్కీం అమలు చేసేలా గడువు విధించింది. ఈ లోపు పన్ను చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తోంది. అయితే నివాస, నివాసేతర భవనాలకు సంబంధించి ఎలాంటి పాత బకాయిలు లేని వారిని అర్హులుగా ప్రకటించింది. సర్కారు ఆదేశాల మేరకు దృష్టి సారించిన బల్దియా యంత్రాంగం గడిచిన ఎనిమిది రోజుల్లో కేవలం రూ.8.33 లక్షలను వసూలు చేసింది.

సద్వినియోగం చేసుకోవాలి



పన్నులను సకాలంలో వసూలు చేసేందుకు ప్రభుత్వం ఎర్లీబర్డ్ స్కీంను అమలు చేస్తోంది. ఈ నెల 30వరకు పన్నులు చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తున్నాం. పట్టణంలోని వ్యాపారులు, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– జాదవ్ కృష్ణ, బల్దియా రెవెన్యూ అధికారి

18 ప్రత్యేక బృందాలు..

పట్టణంలో ఎర్లీబర్డ్ పథకం అమలులో భాగంగా ఈ పన్నుల వసూలు కోసం 18 ప్రత్యేక బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో ముగ్గురు ఉద్యోగులను కేటాయించారు. బకాయిలు లేని వారి వివరాలతో కూడిన జాబితాతో పాటు పీవోఎస్ యంత్రాలను వీరికి అందజేశారు. ఈమేరకు ఆయా బృందాలు ఉదయం, సాయంత్రం వేళల్లో వార్డుల్లో విస్తృతంగా తిరుగుతూ పన్ను వసూలు చేస్తున్నారు. ఏటా ఆస్తి పన్నులకు సంబంధించి ప్రభుత్వం వడ్డీ మాఫీ అమలు చేస్తూ వస్తోంది. గతంలో కోవిడ్ సమయంలో రూ.10వేల లోపు ఆస్తి పన్ను కలిగిన వారికి 50శాతం మాఫీ చేసిన ప్రభుత్వం గతేడాది నుంచి ఎర్లీబర్డ్ స్కీం అమలు చేస్తోంది. ఈ నెల 30వరకు ఈ స్కీం కింద పన్ను చెల్లించేందుకు అవకాశం కల్పించారు. గతేడాది ఈ స్కీంలో రూ.1.83 కోట్లు వసూలు చేశారు. ఈ సారి గడిచిన ఎనిమిది రోజుల్లో 258 మంది రూ.8.33లక్షలు స్వచ్ఛందంగా చెల్లించారు.

సమష్టిగా ముందుకు సాగాలి



పార్టీలో చేరుతున్న వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి సీతక్క

- పార్టీ అభ్యర్థిని గెలిపించాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

ఆదిలాబాద్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బూత్‌లెవల్‌లో కార్యకర్తలు, నాయకులు సమష్టిగా వ్యవహరిస్తూ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. రాహుల్‌గాంధీ దేశఐక్యత కోసం కృషి చేస్తుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాల గురించి మాట్లాడడం తప్ప ప్రజలకు చేసిందేమి లేదని విమర్శించారు. మావల మండలకేంద్రంలోని ఓ గార్డెన్‌లో పార్టీ బూత్‌లెవల్ ఏజెంట్స్ కోఆర్డినేటర్ల సమావేశం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఎన్నికల్లో వ్యవహరించాల్సిన అంశాలపై కార్యకర్తలు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. సమష్టిగా, సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. పార్టీ అభ్యర్థి సుగుణను గెలిపిస్తే జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుపుతామని పేర్కొన్నారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ జిల్లా ప్రజలకు ఏమిచ్చారని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఐదు అమలు చేసిందన్నారు. అనంతరం పవర్ ప్రజంటేషన్ ద్వారా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. అంతకముందు వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో ఖానా పూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, టీపీసీ జనరల్ సెక్రెటరీ సత్తు మల్లేశ్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ, తలమడుగు జెడ్పీటీసీ గణేష్ రెడ్డి, నాయకులు కంది శ్రీనివాసరెడ్డి, ఆడే గజేందర్, అడ్డి భోజారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులున్నారు.

కాంగ్రెస్‌లోకి ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు మున్సిపల్ కౌన్సిలర్లు పి అంజు, సాయిప్రణయ్ మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అలాగే బీజేపీ నుంచి ఎంపీటికెట్ ఆశించిన శ్రీలేఖ, ఆదిలాబాద్ మాజీ జెడ్పీటీసీ కొండ గంగాధర్ సైతం హస్తం పార్టీలో చేరారు.

ఆదిలాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ సమావేశంలో ఆ పార్టీ కార్యకర్తలు



ఆదిలాబాద్‌లో నిర్వహించిన బీజేపీ సమావేశంలో ఆ పార్టీ కార్యకర్తలు



కార్యకర్తపై ఫోకస్

- ఎన్నికల వేళ ప్రధాన పార్టీలది ఇదే బాట
- బూత్ స్థాయిలో ఓట్లు రాబట్టేందుకు ప్రణాళిక
- శిక్షణ, సన్నాహక సమావేశాలతో తర్ఫీదు

సాక్షి,ఆదిలాబాద్: ఉగాది క్రోధి నామ సంవత్సర మొదట్లో నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ నేతలు ఇప్పుడు కార్యకర్తల జపం చేస్తున్నారు. జెండా మోసే కార్యకర్త ఎన్నికల సమయంలోనే గుర్తుకొస్తారని పలు సందర్భాల్లో వారు వాపోయే పరిస్థితులు మనం చూస్తుంటాం.. ఎన్నికలు ముగిశాక ఆయరాం.. గయరాం.. అన్నట్లుగా నేతలు, కార్యకర్తల మధ్య సంబంధాలు కొనసాగుతాయని పార్టీలోనే అనేక సందర్భాల్లో ఉటంకిస్తుంటారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోలాహలం కొనసాగుతుంది. ఈ సమయంలో నేతలకు గుర్తుకొచ్చేది కార్యకర్తనే. బూత్ స్థాయి నుంచి ఓట్లను రాబట్టాలంటే క్యాడర్ పాత్రే కీలకం. దీంతో అన్ని పార్టీల్లో ప్రస్తుతం కార్యకర్త నామమే వినిపిస్తోంది.

పోటాపోటీ..

సిట్టింగ్ స్థానాన్ని తిరిగి సాధించాలని బీజేపీ పట్టుదలగా ఉంది. మరోవైపు ఇక్కడ పాగా వేయాలని కాంగ్రెస్ ప్రణాళిక సిద్ధం చేస్తుంది. నేతలు ఓట్ల కోసం గ్రామ గ్రామాన తిరిగినా ఎక్కడో ఒక చిన్న వెలితి. బూత్ స్థాయిలో కార్యకర్త తనకు పరిచయం ఉన్న వారితో పార్టీకి ఓటు వేయించేలా చేస్తే గెలుస్తానన్న ధీమా కనిపిస్తుంది. దీంతోనే ప్రస్తుతం కార్యకర్తలకు శిక్షణ, సన్నాహక సమావేశాలంటూ పార్టీలు హడావుడి చేస్తున్నాయి. కార్యకర్తలందరినీ ఏకతాటిపైకి తెచ్చి వారికి రాబోయే ఎన్నికల్లో ఎలాంటి బాధ్యతలు నిర్వర్తించాలనే అంశాలపై దిశానిర్దేశం చేస్తున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తుండగా, బీజేపీ సన్నాహక సమావేశంలో భాగంగా ఏ విధంగా ముందుకెళ్లాలనే విషయాలను కార్యకర్తలకు వివరిస్తుంది. ఎన్నికలు ముగిసేదాకా పూర్తిస్థాయిలో శ్రమించాలని సోమవారం నిర్వహించిన బీజేపీ సమావేశంలో ఆ పార్టీ తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ పేర్కొన్నారు. అలాగే ఈ సమావేశంలో పాల్గొన్న పార్టీ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, రామారావు పటేల్, పాల్వాయి హరీశ్‌బాబు, పార్టీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ చిట్యాల సుహాసినిరెడ్డిలు కూడా పాల్గొని కార్యకర్తలకు వివిధ అంశాల్లో సూచనలు, సలహాలు జారీ చేశారు. కాంగ్రెస్ సమావేశంలో రాష్ట్ర మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతీ బూత్‌లో 50 శాతం ఓట్లను కాంగ్రెస్‌కు పడేలా చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. ఈ ఎన్నికల్లో కష్టపడి పనిచేస్తే రాబోయే ఐదేళ్లు కార్యకర్తలదేనని ఆమె భరోసా కల్పించారు.

చేరికలపై దృష్టి..

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండగా ఆయా పార్టీలు చేరికలపై దృష్టి సారించాయి. మంత్రి సీతక్క సమక్షంలో బీజేపీ, బీఆర్‌ఎస్‌ల నుంచి సోమవారం పలువురు కాంగ్రెస్‌లో చేరారు. బీజేపీ నుంచి లోక్‌సభ స్థానం కోసం టికెట్ ఆశించిన శ్రీలేఖకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే బీఆర్‌ఎస్‌కు చెందిన ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు సాయిప్రణయ్, అంజులు కూడా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మరోవైపు ఇంద్రవెల్లిలో బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, పలువురు కార్యకర్తలు బీజేపీలో చేరారు. అభ్యర్థి గొడం నగేశ్, పార్లమెంట్ ఇన్‌చార్జి పాయల్ శంకర్, జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ సమక్షంలో కాషాయ కండువాలు కప్పుకున్నారు. ప్రధానంగా బీఆర్‌ఎస్‌లో తనతో కలిసి పనిచేసిన వారిని బీజేపీలోకి తీసుకురావడానికి అభ్యర్థి గొడం నగేశ్ ప్రయత్నిస్తున్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ గౌస్ ఆలం
- పోలీసు సిబ్బందికి ఇఫ్తార్



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎస్పీ గౌస్ ఆలం



ఎస్పీకి పండ్లు తినిపిస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్:ప్రతిఒక్కరూ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పోలీసు ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ముస్లిం పోలీసు అధికారులు, సిబ్బందికి ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి ఆయన ఉపవాస దీక్షను విరమించారు. అనంతరం సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, ప్రజలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అన్ని పండుగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ స్వప్నిల్ పవర్, సీఐలు కె.సత్యనారాయణ, అశోక్, శ్రీనివాస్, కె.ఫణిందర్, ప్రణయ్ కుమార్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు నవీన్ కుమార్, టి.మురళి, చంద్రశేఖర్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

15లోపు ఏర్పాట్లు పూర్తిచేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా
- నామినేషన్ల ప్రక్రియపై తహసీల్దార్లతో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు ఈ నెల 15లోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నామినేషన్ల ప్రక్రియపై జిల్లాలోని తహసీల్దార్లతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి ఈ నెల 18నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. 25వ తేదీ వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియ మొత్తం వీడియోగ్రఫీ చేయాలని, అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్‌లో ఎలాంటి బ్లాంక్‌లు లేకుండా చూసుకోవాలన్నారు. చెక్ లిస్ట్ ప్రకారం అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సమర్పించేలా చూడాలన్నారు. స్క్రూటినీ రిటర్నింగ్ అధికారి మాత్రమే చేయాల్సి ఉంటుందన్నారు. 26వ తేదీన నామినేషన్ల పరిశీలన, 29వరకు ఉపసంహరణకు గడువు ఉంటుందని పేర్కొన్నారు. మే 13పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు. ఈ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేలా ప్రత్యేకంగా కంప్యూటర్లతో పాటు ఆపరేటర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'అసత్య ప్రచారం చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారు'


సన్మానిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ తనపై చేస్తున్న అసత్య ప్రచారం మానుకోవాలని, లేకుంటే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పుతారని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. సోమవారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు ఆత్రం సుగుణకు శాలువలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం ఓటర్లు కాంగ్రెస్ పార్టీకే జై కొడుతున్నారని, గోడం నగేష్ దీనిని జీర్ణించుకోలేకపోతున్నారని, ఓటమి భయంతో తనను క్రిస్టియన్ మతంలో చేరినట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మెస్రం వంశీయులు మెస్రం ఆనంద్ రావ్, చిత్రు, శేకు, భీంరావ్ ఉన్నారు.

కోటి ఆశల ఉగాది



తెలుగు ప్రజలు నూతన సంవత్సరంగా భావించే పండగ ఉగాది. ఈ పండగ రోజున ఎదైనా శుభకార్యాలు ప్రారంభిస్తే ఏడాది పాటు అంతా శుభమే జరుగుతుందని ప్రజల నమ్మకం. అలాంటి పండగను ఆనందోత్సహాల నడుమ జరుపుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. శోభకృత్ సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ క్రోధినామ నామ సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పండగ రోజున సంప్రదాయబద్ధంగా ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజాధికార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే సాయంత్రం వేళల్లో వేద పండితులు తిథి, వారం, నక్షత్రం, యోగం, కారణం అనే ఐదు అంశాలను ప్రస్తావిస్తూ పంచాంగ శ్రవణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందు కోసం జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. – కైలాస్‌నగర్

- నేటి నుంచి క్రోధినామ సంవత్సరం ప్రారంభం
- ప్రత్యేక పంచాంగాల పఠనం
- గ్రామాల్లో వ్యవసాయ రైతుల ముహూర్తాలు



భైంసా: రైతుల వ్యవసాయ సంవత్సరం నేడు ప్రారంభం కానుంది. శోభకృత్ నామ సంవత్సర ముగింపుతో ఉగాది పర్వదినం నుంచి క్రోధి నామ సంవత్సరం మొదలుకానుంది. మంగళవారం వేకువజాము నుంచే ఉగాది పర్వదినాన్ని జరుపుకునేందుకు రైతులు ముందస్తుగానే సిద్ధమయ్యారు. ఏ గ్రామంలో చూసినా రైతులంతా ఏర్పాట్లలోనే నిమగ్నమై కనిపిస్తున్నారు. నేడు వేకువ జామున పంట పొలాల్లో పంచ పాండవులను ప్రతిష్ఠించి వ్యవసాయ పనిముట్లకు పూజలు చేస్తారు.

నేడే ఖరీఫ్ పనులకు శ్రీకారం...

ఉగాది రోజే కొత్త సంవత్సరంలో వ్యవసాయ పనులను సైతం ప్రారంభిస్తారు. ఇప్పటికే రైతులు తమ పంట పొలాల్లో పత్తిని పీకేసి భూములను చదును చేశారు. ఈ భూముల్లో క్రోధినామ సంవత్సరంలో దుక్కిదున్ని వ్యవసాయ పనులను ప్రారంభిస్తారు. ఈ మేరకు అవసరమైన పరికరాల కొనుగోలు, తయారీ చేపట్టడంలో నిమగ్నమయ్యారు.

బూరెల భోజనంతో...

ఇక పంట పొలాల్లో తమకు తెలిసిన వారిని పిలిపించి అక్కడే భోజనాలు ఏర్పాటు చేస్తారు. ఇళ్లలో నుంచి అంబళ్ల కుండలతో వంటలు చేసుకొని పంట పొలాలకు వెళ్తారు. మహిళలపై ఉన్న బంగారాన్ని ఒక ఆకులో చుట్టి నెలలో పాతి పెడతారు. దుక్కిదున్నిన తర్వాత ఆకును ఇంటి వారు తీసుకొని భూమాత తమకు కొత్త సంవత్సరంలో బంగారం లాంటి పంటలు ఇచ్చిందని సంబర పడుతారు. ఇక దుక్కిదున్నిన వారు, అంబళ్ల కుండలు నెత్తిన మోసిన వారు దినమంతా నిద్రపోకుండా గ్రామ శివార్లుదాటి వెళ్లకుండా నియమాలు పాటిస్తారు. సాయంత్రం వేళ ఇళ్లలో బూరెలు చేసి వ్యవసాయ కూలీలకు తమ వద్ద పని చేసే పాలేర్లకు భోజనాలు పెడతారు.

ఊయ్యాలలు ఊగుతూ...

ఉగాది రోజు చేతి ముహూర్తం పనులు చేసిన రైతులంతా గ్రామాల చుట్టు ఉన్న చెట్లకు తాళ్లు కట్టి ఊయ్యాలాలు ఊగుతారు. ఇక గ్రామాల్లోని ఆలయాల ముందు ఉండే బండరాళ్లను ఎత్తుకొని ఆలయం చుట్టు తిరుగుతారు. ఈ బండరాళ్ల బరువులెత్తే విషయంలో రైతులు పందేలు కాస్తారు. క్షణాల్లో అవలీలగా రైతులు తమకు తెలిసిన చిట్కాలతో పైకి ఎత్తేసి అక్కడ ఉన్న వారిని సైతం ఆశ్చర్య పరిచేలా చేస్తారు.

కులవృత్తుల వారు....

గ్రామాల్లో ఉండే వడ్రంగి, కమ్మరి, విశ్వబ్రహ్మనుల ఇళ్లలోనూ ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. పనిముట్లకు ప్రత్యేక పూజలు చేస్తారు. ఉగాది పండుగరోజు మద్రి ఆకుల్లోనే మొదట పచ్చళ్లు, ఫలహారాలు చేస్తారు. వేపపువ్వుతోపాటు ఇతర వస్తువులను కలిపి పచ్చడి తయారు చేస్తారు. ఇంటికి వచ్చిన వారికి తాగించి పలహారాలు సైతం పంచిపెడతారు.

కొత్త పనుల్లో పాలేర్లు ...

కొత్త సంవత్సరంలో రైతుల వద్ద పాలేర్లుగా నియామకమైన వారంతా ఉగాదిరోజే పనుల్లో చేరుతారు. తమ కొత్త యజమాని వద్ద వచ్చే ఏడాది వరకు పని చేస్తారు. అనంతరం సాయంత్రం గ్రామాల్లో కబడ్డీ ఆటలు ఆడుతారు. ఆలయాల్లో ప్రత్యేక పంచాంగ పఠనం చేయిస్తారు.

పంటలు బాగా పండుతాయి



ఉగాది మంగళవారం రావడంతో కుజుడు రాజయ్యాడు. ఈ ఏడాదిలో కోపం, ఉద్విగ్నత, పరస్పర దూషణలు, దంపతుల కలహాలు, రాజకీయ నాయకుల మధ్య వైరం ఎక్కువగా ఉంటుంది. ఎర్రని నేలల్లో మిర్చి, వేరుశనగ, కందులు వంటి పంటలు విశేషంగా పండుతాయి. మినుములు, నల్లని నువ్వులు, ఉలువలు పండుతాయి. బంగారం, వెండి, ధరలు తగ్గి ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. ఈ ఏడాది జూన్‌లో రుతు పవనాలు సకాలంలోనే వస్తాయి. మృగశిర కార్తె ఆరంభంలోనే రైతులు విత్తనాలను నాటుకోవచ్చు.

– చికిలి లక్ష్మి వెంకటేశ్వర శాస్త్రీ , సిద్ధాంతి, ప్రముఖ పంచాంగ కర్త

పాలేరన్నా.. నీకు జోహారన్నా...

భైంసారూరల్: ఉగాది పర్వదినం రోజంతా వ్యవసాయ పాలేర్లు కొత్త బట్టలు కట్టుకొని తమ యజమాని పంట పొలంలోకి వెళ్లి విధుల్లో చేరుతారు. ప్రతి రోజు ఉదయం నుంచి రాత్రి వరకూ వ్యవసాయ పనులు చేసే పాలేర్లకు అంతకుముందు వారి వారి పనితనాన్ని బట్టే వేతనాలు ఇస్తారు. ఎలాంటి డిమాండ్లు, ప్రత్యేక అలవెన్సులు అంటూ ఏమి ఉండవు.

పీఎఫ్‌లాంటివి లేక పోయినా ...

కార్పొరేట్ రంగాల్లో పని చేసే వారి జీవన శైలిని ఒక్కసారి పరిశీలిస్తే నెలసరి వేతనాలతో పాటు పీఎఫ్‌తో కూడిన ప్రత్యేక అలవెన్సులు ఇస్తారు. ఇక అనారోగ్యానికి గురైనా.. ప్రత్యేక పనులు ఉన్నా వారికంటూ వారానికో సెలవు ఇస్తారు. ప్రత్యేక సెలవులు సైతం వర్తింపజేస్తారు. కొన్ని సందర్భాల్లో ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తినా మెడికల్ అలవెన్సులు సైతం వర్తించేలా ముందస్తు ఒప్పందాలు చేస్తారు. ఎక్కువగా పని చేస్తే ఓవర్‌టైం కింద అదనంగా డబ్బులు తీసుకుంటారు.

అదే పాలేర్లయితే..

అదే పాలేర్ల పరిస్థితి వేరేలా ఉంటుంది. ఉగాదికి ముందు నలుగురు వ్యక్తుల ముందు పెద్దరైతులు వారిని కూర్చోబెట్టి పనితనాన్ని బట్టి వేతనాలు నిర్ణయిస్తారు. ఈ ఏడాది పాలేర్లకు రూ. 1.30 నుంచి రూ.1.70లక్షల వరకు నిర్ణయించారు. నుదుట కుంకుమ పెట్టి బయాన పేరిట కొంత డబ్బు ఇస్తే పాలేరుగా అక్కడ నియామకం జరిగినట్టే లెక్క. ఇక ఉగాది రోజు పనుల్లో చేరిన పాలేర్లు ఏడాదంతా కష్టపడాల్సి ఉంటుంది. కాలంతో సంబంధం లేకుండా ఉదయం లేచిన నుంచి రాత్రి వరకు పనులు చేయాలి.

మండలంలో ఐటీడీఏ పీవో పర్యటన


ఖండాలలో వివరాలు తెలుసుకుంటున్న పీవో

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని వాన్‌వాట్, పిప్పల్‌ధరి, ఖండాల, పోత గూడ గ్రామాల్లో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సోమవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పీవో దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆమె వాటి పరిష్కరం కోసం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మండలంలోని ఖండాల గ్రామ పంచాయతీ పరిధిలోని పోతగూడ శాటిలైట్ కేంద్రాన్ని సందర్శించిన అక్కడ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బోధన డైరీ, శుభ్రత పాటించకపోవడంతో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎసీఈఆర్‌పీని మార్చడం జరిగిందని తెలిపారు. శాటిలైట్ కేంద్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న తాగు నీటి సమస్యలతో పాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈమె ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు.

రాష్ట్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్


కూలీలతో మాట్లాడుతున్న గోడం నగేశ్

గుడిహత్నూర్: రాష్ట్రాభివృద్ధి జరగాలంటే బీజేపీ పాలనతోనే సాధ్యమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. ప్రచారంలో భాగంగా మండలంలో మల్కాపూర్, వైజాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల బాగుకోసం బీజేపీ కట్టుబడి పని చేస్తోందన్నారు. మల్కాపూర్ వద్ద ఉపాధి కూలీలతో మాట్లాడి బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మనంద్, తాంసి జెడ్పీటీసీ రాజు, నాయకులు సుభాష్, భరత్, వామన్ గిత్తే, సుధాకర్ రెడ్డి, కేశవ్‌గిత్తే, సుభాష్‌రెడ్డి, సుకుదేవ్ ఉన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి

ఇంద్రవెల్లి: మూడోసారి మోదీని ప్రధాన మంత్రి చేయడానికి బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఎంపీ అభ్యర్థి నగేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాగ్నే ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి హాజరయ్యారు. జిల్లా ఉపాధ్యక్షుడు సిడాం భీంరావ్, జెడ్పీటీసీ ఆర్క పుష్పలత ఉన్నారు.


స్వర్ణ నదిలో పడి రైతు మృతి

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన అచ్చ చిన్న ఆశన్న(56) రైతు మృతదేహం సోమవారం స్వర్ణ నదిలో లభ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రైతు అచ్చ చిన్న ఆశన్న సైకిల్‌మోటారుపై ఆదివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని తన పంట పొలానికి వెళ్లాడు. ఎంతకూ తిరిగి ఇంటికి చేరకపోవడంతో ఆయన కుటుంబీకులు వెతికినా ఆచూకీ లభించలేదు. తమ బంధువుల ఇళ్లకు ఫోన్ చేసినా రాలేదని సమాధానం రావడంతో భయంతో రాత్రంతా గాలించారు. అయితే అటుగా వెళ్లిన గ్రామస్తులు ఆశన్న సైకిల్‌మోటారును గమనించి ఆయన కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని, సైకిల్ మోటారును బయటకు తీయించారు. ఈమేరకు కేసు విచారణ చేపట్టి పూర్తి వివరాలను వెల్లడిస్తామని ప్రాథమిక విచారణలో ప్రమాదవశాత్తు పడిపోయి ఉండవచ్చని బావిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ ఫతేసింగ్ వివరాల ప్రకారం... ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ గ్రామానికి చెందిన పందిరి మహేందర్ (34)కు 14ఏళ్ల కిందట మహారాష్ట్రకు చెందిన యువతితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. గత నెల క్రితం భార్యాభర్తల గొడవతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మహేందర్ మద్యానికి బానిసయ్యాడు. మనస్తాపంతో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. సోమవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా మృత్యుని వద్ద సూసైడ్ నోట్ లభించిందని, ఆ సూసైడ్ నోట్ వాట్సాప్‌లలో వైరల్ అవుతున్న విషయంపై ఎస్సై ముజాహిద్‌ను ‘సాక్షి’ ఫోన్‌లో సంప్రదించగా ఆ విషయం తమ దృష్టికి వచ్చిందని దానిపై విచారణ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

బావిలోపడి మహిళా రైతు మృతి


హపవత్ నీలా(ఫైల్)

కడెం: వ్యవసాయ బావిలో పడి మహిళా రైతు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దూర్‌తండాకు చెందిన హపవత్‌నీలా(30)సోమవారం మధ్యాహ్నం వరిపొలానికి నీరు పెట్టేందుకు వెళ్లింది. మోటార్ ఆన్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడింది. కుటుంబ సభ్యులు వెళ్లేసరికి బావిలో కనిపించింది. మృతురాలు నీలాకు ఇద్దరు కూతుళ్లు. ప్రస్తుతం కడెం పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాగా భర్త దేవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి పేర్కొన్నారు.

గల్ఫ్‌లో ఖానాపూర్ వాసి..


నవీన్ (ఫైల్)

ఖానాపూర్: ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం బేరాన్ వెళ్లిన యువకుడు అక్కడ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటన సోమవారం తెలిసింది. కుటుంబీకుల వివరాల ప్రకారం.. పట్టణంలోని సుభాశ్‌నగర్ కాలనీకి చెందిన ఉప్పు నవీన్(29) ఏడాది క్రితం బేరాన్ దేశానికి వెళ్లి అక్కడ కూలీ పనిచేస్తున్నాడు. సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నవీన్ మృతి చెందినట్లు అక్కడే ఉండే బంధువు రమేశ్ నవీన్ కుటుంబీకులకు ఫోన్‌లో తెలిపాడు. కనీసం ఉండడానికి ఇల్లు కూడా లేదని, అప్పులు చేసి విదేశాలకు వెళ్లాడని, ప్రభుత్వాలు తమను ఆదుకోవాలని నవీన్ బంధువులు వేడుకుంటున్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాలని వేడుకుంటున్నారు. నవీన్‌కు భార్య లావణ్య, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు. నవీన్ మృతి విషయం తెలియడంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

ట్రాక్టర్‌ను చోరీ చేసిన నిందితుడి రిమాండ్

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన డ్రైవర్ మహేందర్ ట్రాలీ ట్రాక్టర్‌తో రోజంతా పనిచేసి ఈ నెల 6వ తేదీన రాత్రి ఇంటి వెనకాల ఉంచాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి ఇంటి నుంచి ట్రాక్టర్‌ను మాయం కావడంతో ఆదివారం బాధితుడు ఫిర్యాదు చేయగా 24 గంటల్లోనే నిందితుడిని అరెస్టు చేసి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై లింబాద్రి తెలిపారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం సంగెం శ్రీరాంపూర్‌కు చెందిన ఆరేటి రవి ట్రాక్టర్‌ను కడెం మండలంలోని మద్దిపడగ గ్రామంలో దాచి ఉంచినట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను రికవరీ చేయడంతో పాటు నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సకాలంలో నిందితుడిని పట్టుకున్న ఎస్సైతో పాటు పోలీస్ సిబ్బంది మహేష్, భీమేష్‌లను సీఐ సైదారావు అభినందించారు.

బెల్ట్‌షాపుపై దాడి

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మలో సోమవారం సాయంత్రం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పొన్నం శ్రీనివాస్‌గౌడ్‌ను పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌గౌడ్ బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు దాడి చేసి రూ.10వేల 5 వందల విలువ గల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నగదు పట్టివేత

ఇచ్చోడ: మండల కేంద్రంలోని నిర్మల్ బైపాస్ వద్ద సోమవారం సాయంత్రం ఇచ్చోడ సీఐ భీమేశ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా కేశవపట్నం గ్రామానికి చెందిన పశువుల వ్యాపారి వద్ద రూ.2,03,500 నగదును పట్టుకున్నట్లు సీఐ భీమేశ్ తెలిపారు. సరైన పత్రాలు లేకుండా నగదును తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుకున్న నగదును ఎఫ్ఎస్టీ టీంకు అప్పగించినట్లు తెలిపారు.

మొక్కజొన్న పంట దగ్ధం

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన గన్ను శ్రీనివాస్‌రెడ్డి, గన్ను అనురాధ రైతులకు మొక్కజొన్న పంట సోమవారం కరెంటు షాక్‌తో పూర్తిగా దగ్ధమైంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పుస్పూర్‌కు చెందిన గన్ను శ్రీనివాస్‌రెడ్డి, గన్ను అనురాధలకు గ్రామ శివారులో ఉన్న రెండు ఎకరాల్లో యాసంగిలో మొక్కజొన్న పంటను సాగు చేశారు. పంటను కొసి చేనులో అరబెట్టారు. సోమవారం కరెంటు షాట్ సర్క్యూట్‌తో రెండు ఎకరాల మొక్కజొన్న పంటకు కాలిబూడిదైంది. కొంతమేరకు భైంసా అగ్నిమాపక కేంద్రం సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. కాలిపోయిన పంట విలువ రూ.2లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

యువకుడు అదృశ్యం

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన కైరం లింబాద్రి అనే యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న ఇంట్లో నుంచి వెళ్లిన లింబాద్రి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించినా దొరకలేదు. సోమవారం యువకుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో యువకుడికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై సంతోషం రవీందర్ సోమవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సోన్ గ్రామానికి చెందిన తోపారం సాయి ప్రసన్న ఆదివారం సాయంత్రం నిర్మల్ వైపు నుంచి సోన్‌కు వెళ్తున్నాడు. అదే సమయంలో అడ్డదారిలో వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం సోమవారం హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.